శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!!సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురో పినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!




ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కల్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి - 4

## విజయ దశమి సంచిక

## సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి !!



ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
-- అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

---- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో



| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | ఎవరికి ఏది ఇవ్వాలో | బి. రామకృష్ణ |
| 4. | ఆ చల్లని చూపుతో నయం కానిది లేదు | బి. సరస్వతి |
| 5. | గురువుగారి అనుగ్రహమే | డా. రాజశేఖర్ |
| 6. | కాపాడువారే కావలి కాస్తారు | అనిల్ |
| 7. | గురుకృప అనంతం గురు మహిమ అపారం | కె.జి. రాజు |
| 8. | అంతటా తానై.. అన్నింటా తానై... | రమా లక్ష్మి |
| 9. | బాబా మందిర నిర్మాణంలో గురూజీ అభయహస్తం | వీరాస్వామి |
| 10. | అడక్కుండా ఇచ్చిన వరం | దుర్గారాణి |
| 11. | కోరిక తీరింది | సూర్యనారాయణ |
| 12. | ఆ చేయి ఎంత హాయి -(భాగం -14) | డా.యస్. సాయివరప్రసాదరావు |
| 13. | మహనీయుల మహితోక్తులు | గురుచరణదాసుడు |

# ఉన్నమాట - అనుకున్నమాట

సద్గురువు యొక్క ఆశీస్సులు లేకుండా! దేనిని ఎవరు ఏమీ? పొందలేరు. సద్గురువు నాశ్రయించకుండా బ్రహ్మ తత్త్వమును గాని, బ్రహ్మ జ్ఞానమును గాని పొందలేరు. బ్రహ్మను గాని, బ్రహ్మ తత్త్వమును గాని తెలియచేయునది ఆ సద్గురువే! "అసలనునది" అర్థమయ్యేలా! వివరించగలరు. సద్గురువే సమస్తమని నీకు హృదయస్థమైననాడు నీ పాలిట గురువే - బ్రహ్మకాగలడు. నీకు బ్రహ్మ జ్ఞానమివ్వగలరు. నీ కవసరమైనదంతా సమకూర్చగలరు. నీ ఇచ్ఛ మోక్షమే యైనచో అతి సునాయాసముగా చేతికి అందివ్వగలరు. నిన్నంతటి వానిగా చేయగలరు. తనలా నిన్ను తీర్చిదిద్దగల్గిన మహిమ ఈ సృష్టిలో సద్గురువుకు మాత్రమే సాధ్యము "నగురోరధికం నగురోరధికం" అంటె అదే.

అట్టి గురువుకు మొదట శరణు పొందుము. ఆయన వినా ఈ ప్రపంచమే లేదను భావనకు రమ్ము. ఆయన కంటె భిన్నమైన దేదీ లేదని గ్రహించుము. ఆయనకు సాధ్యా సాధ్యముండదను భావన కలిగి వుండుము, ఈ మార్గావలంబి వైచరించునట్టి వారు, మొదట శరణు పొందిన వారే అనన్య శరణాగతికి చేరగల్గుతారు. పంచప్రాణములర్పించు స్థితికి చేరుకోగల్గుతారు. ఒక తిన్ననిలా! ఒక గజేంద్రునిలా! మన బాబాలా! మన గురువు గారిలా! అప్పుడు నీవే అన్నీ అయిపోతావు.(నేనెవరో తెల్సుకుంటె నీవే నేనుగా మారిపోతానను నిత్య ప్రార్థనలోని భావమిదే!)

నీ శిరమును ప్రతి నిత్యము సద్గురు చరణములపై ఉంచుము. నీ చేతులతో ఆయన పాదము లొత్తుము. నీ నయనాలతో ఆ దివ్య సుందర మూర్తిని తనివి తీరాగాంచుము. నిజమైన రక్తి, అనురక్తి కల్గిన ఎడల ఎంత చూచినా తనివి తీరదు. ఒక శబరిలా ఎంతగా సేవించినను తృప్తి తీరదు. ఒక గుహునిలా బంటురీతి వెంట వెంట అంటి పెట్టుకొని తిరిగినను ఇక చాలుననిపించదు. ఒక హనుమంతునిలా! ఆయన పాద జలాన్ని గంగా జలం కన్నా మిన్నలా భావించి తీర్థంలా త్రాగు. అది నీ కల్మషాలను నాశనం చేయగలదు. నీ మనోగత మాలిన్యాన్ని కడిగి వేయగలదు. నిన్ను నిర్మలుని చేసి, మలిన వాసనలను అంటకుండా కాపాడుతుంది. ఈ విధమైనసేవలో ఉన్న సాధకుడు ఈ విషయాన్ని సులువుగా గ్రహించగల్గుతాడు.



సద్గురువు యొక్క గుణగణాలను, లీలలను, మహత్తును, దివ్యగాధలను, వారి ఆర్త త్రాణపరాయణత్వమును, భక్త పరాధీనతను నిరంతరం శ్రవణానందకరముగా వినుము. ఒక అక్రూరునిలా, నైమిశారణ్యములోని మహర్షుల మాదిరిగా! నీ గురునామ చింతనలో - చింతలుతొలుగును. తొలిగిన చింతల స్థానములో గురుచింతనలు నిలువు కొనుము, బంధములు, సంసారబంధములు తొలిగిపోవును.

సద్గురు సేవకు ఆయువును వెచ్చింపుము. ఆయువున్నంతవరకు సద్గురుని సేవ చేయుము. సద్గురువుకు చెందనది నీలో ఏదీలేదు. చెందినవి, చెందుతున్నవి, చెందబోవునవి ఆయనవే. ఆయనకు కాని దేదీ లేదు నాలో, నాలో లేనిదేదీ లేదు వారిలో, నిజానికి నేనున్నది నీలోనను భావం కల్గిన వారిలో మనసెప్పుడు సుఖశాంతులతో నిండిన కుండలా ఉంటుంది. "పరమ ప్రాప్తి" అనగ అదె. అలాంటి వారి ఆరాటమెలాగుంటుంది? వారిని చూస్తున్నంతసేపు ఆకలి దప్పుల ధ్యాస ఉండదు. దుఃఖతీవ్రతలు మనలను వెన్నంటవు. సుఖాల తరగలపై ఆనంద డోలికలలో మనసూగుతుంటుంది. సద్గురువును గాంచుటయే తడవుగా మొదట తనను తాను మర్చిపోయి మనోభావాలు లయించిపోతాయి. శరద్బాబూజీని చూచినంతనే కలిగే సంతృప్తి మనకదే వారి జన్మదిన శుభారంభ సమయాన మనలోని "మహిష" వాసనలు అణగారిపోవాలని ఈ విజయదశమిన ప్రార్థించుదాము.

-- గురు బంధువులు --

## ఎవరికి ఏది ఎవ్వాలో..


నేను జూలై 7న శిరిడీలో ఉన్నాను. అదే రోజు నా పుట్టినరోజు. ఆరోజు గురువుగారి దర్శనానికి వెళ్ళాను. స్టేజీ మీద గురువుగారి పాద దర్శనము లభించింది. గురువుగారు నా బర్త్‌డేకి ఏదైనా ఇస్తారు అనుకున్నాను, కాని ఏమీ ఇవ్వలేదు. నమస్కారము చేసికొని వచ్చేశాను. హైదరాబాదు వచ్చిన తరువాత, ఒకరోజు మా బ్యాంక్ మేనేజరు పిలిచి కంగ్రాట్స్ చెప్పారు. అది ఎందుకంటే నాకు సర్వీసులో కన్ఫర్మేషన్ వచ్చింది. అంతలో ఆయన దానికి సంబంధించిన పేపర్స్ ఇచ్చి ఫిల్ చేయమన్నారు. అప్పుడు కాని నాకు తెలియలేదు, గురువుగారు నాకు ఏమి ఇచ్చారో, కరెక్టుగా నా బర్త్‌డే రోజు ఆ ఆర్డర్స్ (కన్ఫర్మేషన్) టైప్ చేయబడినవి. ఏదో గిఫ్ట్ ఇస్తారనుకున్న నేను, ఆ గిఫ్ట్ చూసి చాలా సంతోషించాను. "ఎప్పుడు ఏది ఎవరికి ఎలా ఇవ్వాలో" గురువుగారికి బాగా తెలుసు అని అర్థమయింది.

కరూర్ వైశ్యా బ్యాంక్, ఇట్లు
హైదరాబాద్ బి. రామకృష్ణ

## ఆ చల్లని చూపుతో.. నయం కానిది లేదు..

*సాయిబాబాకి, గురువు గారికి నా హృదయపూర్వక నమస్కారములు,*

నా పేరు సరస్వతి, మాది శ్రీకాకుళంజిల్లా పాలకొండ మండలము దగ్గర భాసూరు గ్రామము. బాబా అనుగ్రహము, గురువుగారి చల్లని చూపు వలన నేను ఒక కష్టము నుండి బయట పడ్డాను. నా సంతోషాన్ని, ఈ నా అనుభవాన్ని గురుబంధువులందరికి తెలియపరుస్తున్నాను.




జనవరి 2000 సం|| నాకు కుడి చేతికి దురదలు వచ్చి, వేళ్ళు బాగా వాచి ఉండేవి. దురదకు గోకితె వేళ్ళు పిచ్చుకుండేవి. ఊరిలో డాక్టరుకు చూపించితిమి. ఎన్ని మందులు వాడినా తగ్గేవి కాదు. దురదలు విపరీతంగా ఉండటం వలన, బాగా వేడి నీరుతో కడిగినచో 10 ని||లు వరకు తగ్గేవి. తరువాత మరలా దురదలు వచ్చేవి. మరలా వేరే డాక్టరు దగ్గర చూపించాము, తెలుగు (నాటు) మందులు కూడా వాడాం. అయినా మార్పు రాలేదు. ఈలాగున 8 నెలలు గడిచినవి. ఒకసారి వైజాగ్ వచ్చి చర్మ వ్యాధుల నిపుణులకు కూడా చూపించాము. అన్ని టెస్ట్ లు చేసిరి. అయినా తగ్గలేదు.

ఈలాగు మరో రెండు నెలలు గడిచినవి. చేతినిండా తెల్లపొక్కులు వచ్చి, చేయికనిపించకుండా వాపు ఎక్కువ అయినది. బాధ భరించలేనిదిగ ఉండేది. నిద్ర ఉండేది కాదు, భోజనము తినలేకపోవటం, నాకు చిన్న పిల్లల మాదిరి చేసేటట్లు ఒక మనిషి ప్రత్యేకంగా చేయవలసివచ్చేది. అది నాకు ఎంతో బాధ కలిగించేది. బాబా, గురువు గారు నా కర్మను తొలగించండి అని ఏడుస్తూ ఉండేదాన్ని. బాబాని, గురువుగారిని పుల్లు తగ్గించండి అని రోదించేదాన్ని.

కొన్ని రోజుల తరువాత ఆ పుల్లు చీములు కారుతూ ఉండేవి. అరచేతికి ఒక దగ్గర నొక్కితే ఇంకొక దగ్గర చీము విపరీతంగా వచ్చేది. వేళ్ళు కూడా అదే పరిస్థితి. తెలుగు మందులు మళ్ళీ వేరే దగ్గరవాడాము. మొత్తము కాలిన చేయిలా అయిపోయినది. చీములు వస్తూనే ఉన్నాయి. ఇంచు మించుగా రూ. 10,000/-లు వరకు ఖర్చు అయి ఉంటుంది. కాని తగ్గలేదు. ఈ పుల్లును "ఎగ్జిమా" అంటారట. ఈ పుల్లు మండదాటి వస్తే ఒల్లు అంతా తొందరగా వ్యాపించి మనుషులు చనిపోతారట. ఇలా చాలామంది చనిపోయారు అని చాలా మంది చెప్పేవాళ్ళు. నాకు కూడా ఇంక ఇవి తగ్గవు, నా ఖర్మ ఇంతే అనుకొనేదాన్ని.

ఇటువంటి పరిస్థితిలో మా అమ్మాయి వాళ్ళు శిరిడి వెలదాము, గురువుగారికి, బాబాకు చెప్పకుండాము- తగ్గుతుంది. నీవు వైజాగు రావలెను, పుల్లు ఎంత ఎక్కువగా ఉన్నా పరవాలేదు. గురువుగారి మీద భారము వేసి రావలెను, అని ఫోను చేసారు. సరే, వెళదాము అని వైజాగు వచ్చాను.

మేము శిరిడి రేపు బయలుదేరుతాము అనగా నేను వాడే మందులు ఆపేసాను. బాబా, గురువుగారే తగ్గించాలి అని అనుకున్నాను. 2001, జూన్ 5వ తేదిన గురు పౌర్ణమికి మేము శిరిడి వెళ్ళాము. 5 తేదీన పౌర్ణమి, గురువుగారు డయాస్ మీదకి వచ్చినపుడు నేను గురువుగారి దగ్గరికి వెళ్ళి గురువుగారి పాదాలను నా చేతి పుల్లుతో పట్టుకొని నా బాధ, నా సమస్యలు, ఈ పుల్లు తీసెయ్యాలి నేను బాధ తట్టుకోలేను, అని ఏడ్చాను. అప్పుడు గురువుగారు నా చేతిని, నన్ను అలాగ చూసారు. పిడిపూలు ఉన్నా ఇవ్వకుండా దండలో బంతి పువ్వు తుంచి ఇచ్చారు. ఊది ఇచ్చారు. ఊది ఇచ్చిన వెంటనే పావుగంట చలి జ్వరము, వణుకు వచ్చి వెంటనే నార్మల్ అయినది. ఆ రోజు రాత్రి నేను బాబాను చూడటానికి కూడా వెళ్ళలేక పోయాను. మూడు రకాల మాత్రలు పిల్లలు ఇచ్చారు. రాత్రి 12 గంటల వరకు ఏమి జరుగుతున్నది నాకు తెలీదు, పల్లకీ ఉత్సవము జరుగుచున్నది, రామ్మా అని మా అమ్మాయి వచ్చి తీసుకు వెళ్ళింది. అప్పటి నుండి నా చేతి పుల్లు బాధ గుర్తుకు కూడ రాలేదు. మందులు వాడలేదు, చర్మము కుళ్ళి చెడు వాసన వచ్చేసింది. నేను ఆశ్రమములో కూర్చుంటే నా దగ్గర ఉన్న వాళ్ళు దూరము వెళ్ళి పోయేవారు, నాకు బాధ అనిపించి రూముకి వచ్చాను. ఎందుకు వచ్చేసావు అని మా అమ్మాయి అడిగితే, నన్ను చూసి అందరు అసహ్యించుకుంటున్నారు. నాకు బాధ అనిపించి వచ్చేసాను అని ఏడ్చేను. ఆ ఏడుపు ఏదో ఆశ్రములో ఏడువు, అని ఇద్దరము ఏడ్చుకొని ఆశ్రమానికి వచ్చాము. రెండవసారి గురువుగారికి చూపించాము. ఆ రోజు చాలా ఎక్కువ మంది ఆశ్రమములో ఉన్నారు. కాలుకదపటానికి కూడా వీలులేదు. అటువంటప్పుడు నన్ను గురువుగారి దగ్గరకు వెళ్ళమంటున్నారు. ఇద్దరు ముగ్గురుని తప్పించి వెళదామని వెళ్ళుచున్నాను. ఇంతలో ఒక ఆమె పుల్లు చేతిని పట్టుకొని కూర్చో అంటూ లాగింది. నేను, ఒకే సారి బాబా అని ఏడ్చేను. ఆమె పుల్లు చూసి అయ్యో తెలేదు, మీరు గురువుగారి దగ్గరకు వెళ్ళండి అని పంపించారు. గురువుగారితో రెండవసారి పావుగంట నా సమస్యలు మరియు పుల్లు వాసన వస్తున్నాయి అని చెప్పేను, ఊది ఇచ్చి నన్ను అలాగ చాలా సేపు చూసారు. అప్పటి నుండి పుల్లు తగ్గడము మొదలయింది. షిరిడీలో 6 రోజులు వుండి, తిరిగి ఇంటికి వచ్చేసరికి నాకు అసలు పుల్లు లేవు. అప్పటి నుండి ఏ మందులు వాడలేదు. బాబాగారి ఊదియే మందు. గురువుగారి చల్లని చూపే మందు, గురువుగారికి, బాబా గారికి నా అనేక నమస్కారాలు, ఇంత చల్లని చూపుగల దైవము మన మధ్యనే వున్నందుకు నాకు చెప్పలేనంత ఆనందముగా వున్నది.




గురువుగారిని, బాబాగారిని నా జీవితంలో మరువ కూడదని, గురువుగార్కి, బాబాకు కొంత అయినా సేవ చేసుకోవాలని, సత్సంగము చేసుకోవాలనుకుంటున్నాను. దీనికి గురువుగారి ఆశీస్సులు కోరుకుంటున్నాను.

భాసూరు, ఇట్లు
శ్రీకాకుళం బి. సరస్వతి

## గురువుగారి అనుగ్రహమే..

నేను ఏప్రిల్ 2000లో BHMS Final Year Exams రాస్తున్నాను. Theory ఓ మాదిరిగా రాసాను. ఇక వైవా కూడా ఈజీ గానే అయిపోతుందిలే అనుకున్నాను. మాకు మెడిసిన్ అనే సబ్జెక్టుకి ప్రాక్టికల్ వైవా ఉంటుంది. అందులో ఒక్కొక్కరు మూడు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఇది మాకు పాస్ అయ్యే విషయమై చాలా ఇంపార్టెంట్ కూడా. అందరూ కరెక్ట్ గానే సమాధానాలు చెప్తున్నారు. నా వంతు వచ్చింది. నేను అసలు ఎక్స్‌పెక్ట్ చేయని విధంగా రెండు తప్పులు చెప్పి వచ్చాను. నిజానికి అవి చాలా ఈజీ. ఎవరైనా సరే కరెక్ట్‌గానే చెప్తారు. అదేమిటోగాని ఆ నిమిషంలో అలా తప్పు చెప్పేసాను. బయటకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా కళ్ళల్లో నీళ్ళు

తిరిగాయి. నేను చేసింది పెద్ద తప్పు, మిగతా వాళ్ళెవరూ అలా చేయలేదు. ఇక మరో విషయమేమిటంటే మా క్లాస్‌లో ఎగ్జామ్స్ రాసింది కేవలం 6 మంది అబ్బాయిలు. మిగతా 35 మంది అమ్మాయిలే ప్రతీసారి క్లాస్ నుండి 7-8 మంది ఫెయిల్ అవుతారు. అందులో అబ్బాయిలు ఖచ్చితంగా ముగ్గురయినా ఉంటారు. ఈ సారి మా బ్యాచ్ లో 4గురు అబ్బాయిలకు మంచి ఇంప్రెషన్ ఉంది. ఇక మిగిలిన ఇద్దరిలో నేనొకడిని. దానికి తోడు VIVA లో అంత పెద్ద పొరపాటు చేసాను. నేను ఎట్లాగయినా ఫెయిల్ అయినట్లే అనుకున్నాను. అందుకే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చాలా బాధ కలుగుతోంది, ఏం చేయాలో అర్థం కాలేదు. వెంటనే కాచిగూడ సత్సంగ మందిరం కెళ్ళి గురువుగారికి లెటరు రాసుకున్నాను ఎగ్జామ్స్‌కు ముందు ఫస్ట్‌క్లాస్ కావాలని అడిగేవాడిని, నా కిప్పుడు ఫస్ట్‌క్లాస్ వద్దు, మంచి మార్కులు కూడా వద్దు, కేవలం పాస్ అయితేచాలు, అది కూడా 400 కి 201 కూడా వద్దు, 200 మార్కులు మాత్రం వచ్చి పాస్ అయినా చాలు (మాకు 50% పాస్ మార్కులు) అని కోరుకున్నాను. ఆ రోజుకి ప్రశాంతంగానే అనిపించింది కానీ రోజులు గడుస్తున్న కొద్దీ చెప్పలేనంత టెన్షన్. నా టెన్షన్‌కి మరొక కారణం కూడా ఉంది. నేను 3 సం||ల క్రితం ఒకసారి మా బంధువులింటికి వెళ్ళినపుడు అక్కడికి ఒక ముసలాయన వచ్చారు. అతడు గొప్ప రామభక్తుడట. నువ్వేం చేస్తున్నావు? ఏ ఇయర్ అని నన్నడిగారు. నేను చెప్పగానే, నువ్వు ఫైనల్ ఇయర్‌లో ఫెయిల్ అవుతావు అన్నారు. నాకు కోపం వచ్చింది. నేనసలు ఆయనను ఏమీ అడగలేదు. పైగా నేనొక గొప్ప సద్గురువు వద్ద వున్నాను. మధ్యలో ఈయన చెప్పడమేమిటి? అనుకున్నాను. అప్పటికి అది అలా వదిలేశాని కాని ఎగ్జామ్స్ సరిగా రాయకపోయేసరికి మళ్ళీ ఆ విషయం మనసులో మెదలడం ప్రారంభమైంది. ఒకరోజు సత్సంగంలో ఏదైనా మంచి నిదర్శనం దొరికితే బాగుండును అని అనుకున్నాను. మరుసటి రోజు "గురుకృప" ఇంటికి వచ్చింది. ఆ పత్రికలో గురువుగారు గ్రేస్ మార్కుల గురించి చెప్పిన విషయం ఉంది. అది చూసి చాలా ఆనందపడ్డాను. 2-3 రోజుల తర్వాత మళ్ళీ సందేహం ప్రారంభమైంది. ఇంతలోనే డాక్టర్ అంకుల్ (డా.బి.ఎస్.రెడ్డి) కలిసారు. శిరిడీ వెళ్ళొచ్చు కదా! అన్నారు. అంతే వెంటనే శిరిడీకి వెళ్ళాను. రిజల్ట్స్ కోసం వెయిట్ చేస్తూ అక్కడే ఉండిపోయాను. కాని అక్కడ కూడా అదే డౌట్ ఎందుకో గాని నేను కంపల్సరీ ఫెయిల్ అవుతానని మనసుకు అన్పిస్తూ ఉండింది. రిజల్ట్స్ వచ్చాయి. డాక్టరు అంకులే నన్ను పిలిచి నువ్వు పాస్ అయ్యావు అని చెప్పారు. ఏమో థియరీ పేపర్ కొంచెం బాగా రాసానేమో అనుకున్నాను. కాలేజి కెళ్ళి మార్క్స్ చూసుకున్నాను. అన్నింటికంటె ఆశ్చర్యం! నాకు మెడిసన్‌లో ఎగ్జాక్ట్ గా 200 మార్కులే వచ్చాయి. ఇది ఖచ్చితంగా గురువుగారి అనుగ్రహమే అని కన్ఫర్మ్ అయినట్టే కదా.



30-7-2001 ఇట్లు
హైదరాబాదు డా.రాజశేఖర్

## "కాపాడు వారే కావలి కాస్తారు"

నాపేరు అనిల్ కుమార్. నేను ప్రస్తుతం హైదరాబాద్ ఇ.సి.ఐ.ఎల్. ఏరియాలో ఉంటున్నాను. నేను మా చిన్న బావగారి దగ్గర పని చేస్తున్నాను. మేము యు.పి.ఎస్. లు, పవర్ సేవ్ లు తయారు చేస్తుంటాము. మా కంపెనీ మా ఇంటికి 1/4 కిలో మీటరు దూరములో ఉంటుంది.


రోజూ మేము కంపెనీలో బాబాకి, గురువుగారికి అగరవత్తులు వెలిగించి పని ప్రారంభిస్తాము. ఒకరోజు మేము కంపెనీకి తాళము వేసి ఇంటికి వెళ్ళాము. మరుసటిరోజు వెళితే మా షాపులో దొంగలు పడినట్లు తెలిసింది. తలుపుని రంపముతో కోసి లోపల నుండి గడతీయడానికి ప్రయత్నాలు చేసి విఫలమైనట్లు కనబడుతుంది.

మా ఇంటి ఓనరు మా షాపుపై భాగములో ఉంటారు. అసలు జరిగినది ఏమిటని మా ఇంటి ఓనరుని అడగగా, రాత్రి క్రింద బాగా చప్పుడు అయినట్లు అనిపించి మేము బయటకు వచ్చి చూద్దామనుకుంటే దొంగలు

మమ్మల్ని బయటకు రాకుండా మా ఇంటి బయట గడియ పెట్టినారు. పై నుండి వాళ్ళు అరుస్తున్న ప్రక్క వాళ్ళకు ఏమీ వినబడలేదని చెప్పినారు. ఉదయం వాళ్ళ పాలవాడు వచ్చి తలుపు తీసిన తరువాత క్రిందకి వచ్చి చూడగా తలుపుకి పెద్ద కన్నము పెట్టి ఉండటము చూసి గాభరాగా మీకు ఫోన్ చేసినామని చెప్పారు. అప్పుడు మా బావగారు చూడగా మావి చిన్నమేకు కూడా పోలేదని గుర్తించాము. అసలు దొంగ ఏ తలుపు అయితే కోసాడో ఆ తలుపు ఎదురుగా గురువుగారి, బాబాగారి ఫోటోలు ఉన్నవి. ఆ ఫోటోల ప్రభావము వలన దొంగ లోపలికి రాలేక పోయాడని నా భావన. ఆ రోజు మేము ఎప్పుడు పెట్టనంత స్టాక్ రెడిటుసేల్ అన్న పొజిషన్‌లో ఉంచాము. నిజంగా గురువుగారి, బాబాగారి అనుగ్రహము లేకపోతే ఆ రోజు చాలా నష్టపోయేవాళ్ళము.

గురువుగారి అనుగ్రహం వలన మా కంపెనీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తుంది. కాని మాకు ఏదైనా మెటీరియల్స్ అనగా బేటరీస్, కార్టన్స్, థెర్మాకోల్ వంటివాటి కోసం ఏ రోజుకారోజు ఏదో పని మీద బయటకు తెగ తిరుగు తుండేవాళ్ళము. ఎక్కువగా బ్యాటరీలకు అధిక శ్రమ తీసుకునే వాళ్ళము. ఒకరోజు గురువుగారితో "సార్, ఏమిటి సార్ మేము ఎక్కువగా టైర్ అవుతున్నాం, బ్యాటరీలు ఇంటికి తెచ్చే మార్గము చూపండి" అని వేడుకున్నాను. అంతే వెంటనే బ్యాటరీలతో పాటు అన్ని చివరికి "స్క్రూలు" కూడా ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. మాకు చాలా శ్రమ తగ్గింది. ఆ సమయాన్ని వేరొక పనికి వినియోగించాలని అనుకుంటున్నాను.

అలాగే మా చిన్న చెల్లెలు సునీతకు పాపపుట్టింది. ఆ పాపను తీసుకుని పుట్టింటికి అనగా మా ఇంటికి (విజయవాడ) వచ్చింది. కొన్ని రోజులు ఉండి తిరిగి హైదరాబాద్ వెళదామనుకుంది. ఆ రోజు రానే వచ్చింది. నేను, మా చెల్లెలు, పాప, మా అల్లుడు సబూరి(4 సం||లు) మేము రాత్రి విజయవాడ నుండి డైరెక్టుగా ఇ.సి.ఐ.ఎల్. వెళ్ళే ఆర్.టి.సి బస్‌కి వెడదాము అనుకున్నాము. రాత్రి 10.30కి ఒక బస్ ఉంది. ఆ బస్‌లో టికెట్స్ రిజర్వు చేద్దాము అనుకున్నాను. కాని ఎందుకో బుక్ చెయ్యలేదు. నేరుగా 10 గంటలకు బస్‌స్టాండ్ కి వెళ్ళి 10.30 బస్‌కి టిక్కెట్లు అడిగితే ఒక్క టిక్కెట్టే ఉందని చెప్పాడు. అది కూడా లాస్ట్ నెంబర్. ఇక చేసేది లేక 10.45 గం||లకు బస్‌లో టిక్కెట్లు బుక్ చేసాము. అవి కూడా లాస్ట్ నెంబర్స్. కాని బాబా దయవలన ముందు సీట్లలో కూర్చుని వచ్చినాము. వెళ్ళేటప్పుడు దాదాపు 30 ని||లు ట్రాఫిక్‌జామ్ వలన ఆపేసారు. తీరా కారణము ఏమిటని చూస్తే మేము ఏ బస్సు ముందు ఎక్కుదామనుకున్నామో ఆ బస్సు తిరగబడింది. నిజంగా ఆ బస్సులో టిక్కెట్ ఎందుకు దొరకలేదో అప్పుడు అర్థమయింది. జనరల్‌గా నాకు టిక్కెట్ల విషయంలో, even సినిమా టిక్కెట్లు అయినా దొరకకుండా వచ్చిన సందర్భము లేదు. అది కూడా బ్లాకు (Black) లో అసలు కొనను. అటువంటిది గురువుగారు మమ్మల్ని ఆ బస్‌లో ఎందుకు పంపలేదు అని అలిగినప్పటికి, 5 గంటల తర్వాత గాని నాకు "ఆ ప్రేమ ఎట్టిదో" అర్థం కాలేదు.




23-3-2001 ఇట్లు
హైదరాబాద్ అనిల్

## గురుకృప అనంతం... గురు మహిమ అపారం


శ్రీ పూజ్య సద్గురు దేవులు శ్రీ సచ్చిదానంద సర్వ సమర్థ సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబా మహరాజ్ దివ్య పాదపద్మములకు అనేకానేక సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ శ్రీ గురుదేవులు చేసిన అద్భుత లీలను గురుబంధువులకు తెలుపుకుంటున్నాను. నా కుమారుడు బాలాజీ భాగ్యరాజ్ గురుదేవుల దగ్గరకు, బాబాగారి దగ్గరకు రానిరోజులలో ఎన్నో ప్రయత్నాలు చేయడం జరిగింది. అబ్బాయికి పుట్టుకతోనే కంటి ఎలర్జీ అని డాక్టర్లు చెప్పడం జరిగింది. కంటిలో తెల్లగుడ్డు, ఎలర్జీ ఎక్కువైనప్పుడు మట్టి రంగుగా మారుతుంది, చాలా బాధపడుతుంటాడు.

1) కళ్ళు వెంట నీళ్ళు కారడం 2) కళ్ళు ఎర్రబడడం అంటే చింత నిప్పులవడం 3) ఊపిరి అందనట్లుగా బాధ పడడం.

T.V. చూడడానికి లేదు. పుస్తకం చదవలేడు. ఇలా బాధలు పడడం జరుగుతుంది. లోకల్ డాక్టర్ (కందుకూరు), తరువాత ఒంగోలు డాక్టర్లు పరీక్షలు చేయడం తాత్కాలికంగా మందులు ఇవ్వడం, వేయడం - తరువాత మామూలే. ఈ డాక్టర్ల తరువాత హైదరాబాద్‌లో పేరు ప్రఖ్యాతులున్న డాక్టరు శివారెడ్డిగార్కి (రాష్ట్రపతిలాంటి వాళ్ళకు ఆపరేషన్ చేసినటువంటి డాక్టరు) చూపించగా, ఈ అబ్బాయికి ఇప్పుడే ఖచ్చితమైన మందులు ఇవ్వలేము. 12 సం||లు తరువాత అయితే బాగు చేయడానికి వీలు పడుతుంది. అంతవరకూ తాత్కాలికంగా మందులు వాడండి తగు జాగ్రత్తలతో అని చెప్పినారు. ఇక మాకు చాలా బాధ కలిగింది. ఈ అబ్బాయికి పరిష్కారం లేదా, దొరకదా అని తరువాత ఇంకొకరి సలహా మేరకు మద్రాసులో ఉన్న కంటి హాస్పటల్ శంకర నేత్రాలయముకు తీసుకువెళ్ళాము. వాళ్ళు పరీక్షలు జరిపి ఈ అబ్బాయిని మీరు ఎ.సి. రూములో పెట్టి మందులు వాడితే తరువాత చెప్పగలం అని, మందులు ఇచ్చారు. ఈ హాస్పిటల్ రీసర్చ్ కంటి హాస్పటల్ వారు డేట్ ఇచ్చి మరల రండి అని చెప్పినారు. డేట్ ప్రకారం మరల వెళ్ళడం జరిగింది. కాని పరిష్కారం దొరకలేదు. మా కుటుంబం గురించి బాబా, గురుదేవులు దయ దలచినారని చెప్పుకుంటాను. అనుకోకుండా మా కుటుంబం పరిస్థితి బాగాలేనందున, కుటుంబం అస్తవ్యస్తంగా ఉండడం, నా భార్య స్నేహితురాలు, గురుబంధువు మాధవిలత టీచరు గారు కలసి సాయిప్రసాద్ సార్ దగ్గరకు వెళ్ళడం జరిగింది. ఉన్నటువంటి ఇబ్బందులు చెప్పుకోగా, ఎందుకమ్మా మనకు గురువుగారు, బాబా ఉన్నారు, తప్పక సహాయం చేస్తారు అని సార్ ధైర్యం చెప్పడం జరిగింది. అయితే మీరు సత్సంగానికి వస్తుండండి, వీలైనంత త్వరలో మీరు గురువుగారిని దర్శించుకొని మీ ఇబ్బందులు చెప్పుకోండి అని చెప్పి, మీ వారిని కూడా తీసుకు వెళ్ళండి అని చెప్పారు. నా భార్య నా దగ్గరకు వచ్చి చెప్పింది. నేను వెంటనే ఆ రోజులలో ఎంత స్ట్రాంగ్ గా వుండాలో అంత స్ట్రాంగ్‌గా వుండేవాడిని, అహంకారానికి ఇక కొదవలేదు. ఇంతమంది డాక్టర్లు చేయలేనిది, ఆయనేం చేస్తారు అని చాలా తేలికగా విమర్శించాను. అది కాదంటూ అబ్బాయి సంగతి, మనకు ఉన్న అప్పుల బాధలు అన్నిచెప్పుకుందాం అంటే ఆ మంచి మాటలు నా చెవికి కాస్తంత అయినా ఎక్కలేదు, రుచించలేదు. మరల నా భార్య సాయిప్రసాద్‌సార్ దగ్గరకు ఒకసారి వెళ్ళండి, కలిసి రండి అని వత్తిడి చేయగా అతి కష్టం మీద బలవంతంగా ఇష్టం లేకుండా వెళ్ళడం జరిగింది, సార్‌కు ఏదో ఒక దొంగ నమస్కారం చేసి అర్జంటుగా, బాబా గురువుగారు, మేలు చేసేస్తే తీసుకుపోదాం అని వెళ్ళడం జరిగింది. సాయిప్రసాద్‌సార్ అన్నారు, బాబు నీవు రోజు సత్సంగానికి రావాలి. గురువుగారికి ఉత్తరము వ్రాసుకోవాలి చాలా తొందరలో శిరిడి వెళ్ళు, బాబాని, గురువుగారిని దర్శనం చేసుకొని, నీకు ఉన్నవన్నీ గురువుగారికి చెప్పుకోవలసిందే, ఆలస్యం చేయవద్దు అని అన్నారు. నాకు వెంటనే అనిపించింది, నా బాధలు చెపితే ఎక్కడో ఉన్న శిరిడీ వెళ్ళమంటారేంటి, రోజూ సత్సంగానికి వెళ్ళాలట, ఉత్తరాలు వ్రాయాలంట, బాగానే ఉంది. ఇక్కడ నాకు లాభంలేదు. ఎంత తొందరగా బయటకు పోదామని ప్రయత్నిస్తూ వెళ్ళొస్తాను సార్ అని లేచి, బయటకు వెళుతూ ఉండగా, నాయనా బాబా ఫోటోకు, గురువుగారి ఫోటోకు నమస్కారం చేసుకో అని చెప్పినారు. అప్పుడు కూడా ఫోటోలు తాకితాకకనే దొంగ నమస్కారాలు చేసుకొని వెనక్కు తిరగ్గా నీవు గురువుగారికి ఉత్తరం వ్రాసుకొని సత్సంగమందిరానికి తీసుకురా అని చెప్పారు. సరే అని, వెంటనే బయట పడ్డాను. ఇలా కొన్ని రోజులు జరుగగా ఒక రోజు కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో సార్ కాఫీ తాగుతున్నారు. నన్ను చూడగానే, సార్‌కు దొరికి పోయాను అని మనసులో అనుకుని మరొక దొంగ నమస్కారం చేసి ప్రక్కనే నిలబడగా, నాకు కూడా సార్ ఒక కాఫీ ఇప్పించారు, త్రాగుతున్నాం. "ఏం రాజు గురువుగారికి లెటర్ వ్రాసావా" అని అడిగారు. నా గొంతులో వెలక్కాయ పడింది. వాస్తవంగా గురువుగారికి ఉత్తరం వ్రాయలేదు, వ్రాయాలన్న ఆలోచనే లేదు, సార్ అన్నారు కదా అని "ఊ" అన్నాను. అయితే నాలో ఒక ప్రత్యేకత ఉంది. అబద్ధం ఆడడంలో నేను చాలా నేర్పరిని. అయితే సార్ దగ్గర అబద్ధం చెప్పలేక పోతున్నాను. ఈ అవస్థ సార్ గమనించి నీవు ఈ రోజు రాత్రికే గురువుగారికి లెటర్ వ్రాసి రేపు తీసుకురా అని చెప్పి వెళ్ళిపోయారు. ఇష్టం లేకనే నా గురించి కాక, సార్ మరల లెటర్



ఎందుకు వ్రాయలేదు అంటారని, గురువుగారికి లెటర్ వ్రాసి సార్ కి తీసుకు వెళ్ళి ఇవ్వడం జరిగింది. సార్ "తరచూ సత్సంగానికి వస్తూండు" అని చెప్పారు. నా బుద్ధి మామూలే కదా! ఎప్పుడు బయట పడదామా అని ఆయన చేతిలో లెటర్ పెట్టి బయటకు వచ్చేసాను. బాబా దయవలన, గురుదేవుల దయవలన అతి తొందరలో నేను బలవంతంగా శిరిడి వెళ్ళడం జరిగింది. బాబాను, గురువుగారిని దర్శించుకున్నాము. గురుదేవుల ఆశీర్వాదం వలన 2,4 రోజుల్లో బయలు దేరాలనుకున్న నేను 9 రోజులు శిరిడిలో ఉండడం జరిగింది. గురుదేవులకు నాకు ఉన్న ఇబ్బందులు కష్టాలు అన్నీ చెప్పుకోవడం, అబ్బాయి కంటి గురించి గురుదేవులకు చెప్పుకోవడం జరిగింది. గురుదేవులు వెంటనే "బాబా చూసుకుంటారు" అని వారి నోటి నుండి అమృత వాక్కులు చెప్పినారు. తరువాత నన్ను బయలుదేరమని గురుదేవులు చెప్పడంతో - నాకు మనసులో బయలు దేరాలనే ఉన్నది. గురుదేవులకు సాష్టాంగ నమస్కారము చేసుకుని, వారి ఆశీర్వాదంతో బాబాగారి ఆశీస్సులతో ఇంటికి వచ్చినాను. కొద్ది రోజులలోనే మా అబ్బాయి కంటి ప్రాబ్లమ్, ఒక రోజు రాత్రి 12 గంటలలోపు చాలా సీరియస్ పరిస్థితి, నాలో భక్తి లేదు, ప్రేమలేదు, విశ్వాసం అసలే లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే భగవంతుడిని, గురువుగారిని ప్రార్థించే శక్తి లేని వాడిని, అర్హతలేనివాడిని, గురుదేవుల ఫోటో గోడకు తగిలించి ఉంది. అలా ఫోటో దగ్గరకు వెళ్ళి నిలబడి కళ్ళ వెంట నీళ్ళతో "గురు దేవా మిమ్ములను ప్రార్థించే శక్తి లేని వాడను, ఎన్నో అవలక్షణాలు గలవాడను. నా కొడుకు కంటి పరిస్థితి చాలా సీరియస్ గా ఉంది. చాలా మంది గురుబంధువుల దగ్గర విన్నాను, బాబా ఫోటోకు చెప్పుకున్నా, మీ ఫోటో కు చెప్పుకున్నా మా ప్రార్థన అందుతుందని. దయతో కనికరించి మా ప్రార్థన మీ దగ్గరకు వచ్చేటట్లు మీకు అందేట్లు దయ తలచండని చేతులు జోడించి ప్రార్థించడం జరిగింది. అదే నా మొట్టమొదటి చేతనైనంత ప్రేమతో చేసిన ప్రార్థన. గురుదేవులు, నాకు ఇష్టమైన మాటలో చెప్పాలంటే నా దైవం దయతలచి ఇంత సీరియస్ కండిషన్ నుండి గురుదేవుల ఫోటో దగ్గర 71/4 నిముషముల ప్రార్థనతో నే అబ్బాయి కున్న సీరియస్ కండిషన్ నుండి కాపాడిన గురుదేవులకు, నేను, నా కుటుంబం ఎప్పటికి ఋణపడి ఉంటాము. వారి ఈ అద్భుత లీల మా కుటుంబమునకు ఎంతో వెలుగును ప్రసాదించింది. అప్పటి నుండి గురుదేవులు ఎన్నో, ఎన్నెన్నో అద్భుతమైన లీలలు చూపారు మాకు. ప్రతి క్షణం వారి రక్షణతో ఆశీస్సులతో మమ్మల్ని నడిపిస్తున్నారు. గురుదేవుల పాదపద్మములము అనేక సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ, బాబా గారి పాదపద్మములకు మరి యొకసారి సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ, ఇంత అద్భుత, గొప్ప సద్గురువు అయిన సద్గురు శ్రీసాయినాథుని శరత్ బాబూజీ గారిని, గురుదేవులుగా ప్రసాదించిన బాబాకు ఎప్పటికీ నా సాష్టాంగ నమస్కారములు చేసుకొంటున్నాను.



ఈ లీల ప్రత్యేకత, మా అభిప్రాయం: ఇంట్లో పూజగదిలో ఉన్న మా అబ్బాయి దగ్గరకు గురుదేవులు వచ్చినారని మా నమ్మకం. ఎందుకంటే అబ్బాయి అన్నాడు ఎవరో వచ్చి వెళ్ళినారని. వచ్చింది గురుదేవులే అని మా విశ్వాసం.

ఇట్లు


కందుకూరు — కె.జి.రాజు

## అంతటా తానై... అన్నిటా తానై...

నేను Project కోసం III M.C.A. theory Exams అయిపోగానే డిసెంబర్ 2000లో హైదరాబాద్ వెళ్ళినాను. మా అన్నయ్య నన్ను 'గురుకృప' మీద Project చెయ్యమనేవాడు. మొదట నేను ఆసక్తి చూపలేదు. తరువాత జనవరి 1కి షిరిడీ వెళ్ళినప్పుడు గురువుగారి నుండి పర్మిషన్ తీసుకున్నాను. రోజు గురువుగారిని Project సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ అయ్యేటట్లు చూడండి అని అనుకొనేదానిని. కాలేజ్‌కి సబ్‌మిట్ చేయటానికి సరిపడా కంప్లీట్ చేసినాను. జూన్ లో Project వైవా జరిగినది. మా కాలేజ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఏమిటి ఇలాంటిది చేసినావు అని ఆశ్చర్యపోయినారు. Project వైవాకి ఎక్స్టర్నల్ JNTU నుంచి వచ్చినారు. ఆయన మొత్తం బాబా,

గురువుగారి గురించి అడిగినారు. నా M.C.A. Course మొత్తం కూడా గురువుగారే నాకు ధైర్యాన్ని ఇస్తూ కంప్లీట్ చేయించారు.

నేను హైదరాబాదు వచ్చినప్పటి నుంచి జాబ్ కి ట్రై చేస్తు ఉండేదానిని మార్కెట్ పొజీషన్ చూసి అసలు నేను ఎప్పటికైనా జాబ్ లో జాయిన్ అవుతానా, అని అనుకొనే నాకు గురువుగారు ఎవరి తోనయినా ధైర్యం చెప్పిస్తూ ఉండేవాళ్ళు. జూన్ లో ఒక గురు బంధువు ఫోన్ చేసి రేపు ఒక కంపెనీ వాళ్ళు Aptitude Test Conduct చేస్తున్నారు, హాజరు అవ్వు అని చెప్పాడు. వెళ్ళి టెస్ట్ వ్రాసి వచ్చినాను. ఆ తరువాత వారం రోజులకి నేను Project సబ్ మిట్ చేయటానికి తెనాలి వచ్చాను. మా Project వైవా రోజే మళ్ళీ ఆ కంపెనీ వాళ్ళు Aptitude Test లో క్వాలిఫై అయిన వాళ్ళకి పజిల్స్ అండ్ అల్గరిథమ్స్ లో టెస్ట్ ఉంటుందని అన్నారు. నన్ను కూడా టెస్ట్ కి పిలిచారు. నేను తెనాలిలో ఉన్నాను. ఇక్కడ ఫైనల్ Project వైవా, అక్కడ టెస్ట్ ఒకే రోజు. గురువుగారే టెస్ట్ వ్రాసేటట్లు చూడాలని అనుకొన్నాను. నేను మళ్ళీ ఫోన్ చేస్తే వాళ్ళు నీ వైవా కంప్లీట్ చేసుకొనే రమ్మని చెప్పినారు. ఎలాగయితేనేం గురువుగారు ఈ టెస్ట్ వ్రాసే అవకాశం కలిగించారు. గురువుగారి మీద భారం మోపితే, ఆయన ఇవ్వదలచుకొంటే ఎలాగైనా ఇప్పిస్తారు అనుకొన్నాను. టెస్ట్ వ్రాసినాను, కాని నేను వ్రాసిన దాన్ని బట్టి నాకు ఈ టెస్ట్ లో క్వాలిఫై అయ్యే అవకాశం లేదని అనుకొన్నాను. ఆ తరువాత వారం రోజులకు గురుపూర్ణిమకి షిరిడి వెళ్ళినాను. నేను షిరిడి బయలుదేరిన రోజే అంటే జూలై 3న ఆ కంపెనీ వాళ్ళు నాకు జూలై 9న ఇంటర్వ్యూ ఉంటుంది రమ్మని మెసేజ్ ఇచ్చారు. నేను అప్పటికే బయలుదేరటంతో నాకు తెలియలేదు. నేను జూలై 13న షిరిడి నుండి హైదరాబాద్ వచ్చినాను. రాగానే మా రూమ్ మేట్స్ నిన్ను ఇంటర్వ్యూకి పిలిచారు, నీవు మిస్ అయినావు అని అన్నారు. నేను వెళ్ళి ఆ కంపెనీకి ఫోన్ చేసి రెక్వెస్ట్ చేస్తే మళ్ళీ జూలై 16న ఇంటర్వ్యూకి పిలిచారు. హాస్టల్ లో కొంతమంది నా గురించి ఆ అమ్మాయి షిరిడి వెళ్ళింది కదా! వాళ్ళ గురువుగారు ఇంటర్వ్యూ పోస్ట్ ఫోన్ చేయించవచ్చు లేదా ఆ అమ్మాయిని రప్పించవచ్చు కదా! అని అనుకొన్నారట. మళ్ళీ ఇంటర్వ్యూకి పిలిచారు అంటే చాలా మంది ఆశ్చర్యపోయినారు. "గురువుగారు మనకు ఇవ్వదలచుకొంటె (ఏదైనా) ఎలాంటి పరిస్థితులలోనైనా ఆయన ఇవ్వగలరు" అని అర్థమైంది. 16న టెక్నికల్ ఇంటర్వ్యూకి హాజరైనాను. మళ్ళీ అదే పరిస్థితి ఇంటర్వ్యూ అయిపోయింది. నాకు వస్తుందని నమ్మకం లేదు. ఆ రోజు బాబా మందిరంకు వెళితే అక్కడ పూజారి పువ్వు ఇచ్చినాడు. ఆ రోజు సాయంత్రం ఆ కంపెనీ వాళ్ళు పిలిచి రేపు అంటే 17 జూలైన మళ్ళీ సెమిటెక్నికల్ ఉంటుంది రమ్మని చెప్పారు. 16 జూలైన నా ఇంటర్వ్యూ అయిపోయి వస్తుంటే మా డిగ్రీ క్లాస్ మేట్ కనిపించినాడు. అతను అదే కంపెనీలో ఇంటర్వ్యూ పూర్తి చేసుకొన్నాడు. అతనిని అడిగిన కొన్ని ప్రశ్నలను నాకు చెప్పాడు. నేను 16న రూమ్ కి వెళ్ళి వాటికి జవాబులు తెలుసుకొన్నాను. 17న ఇంటర్వ్యూలో వాటిలో ఒక ప్రశ్న అడిగినారు. ఆ రోజే సెలెక్టెడ్ అని చెప్పినారు. ఈ విధంగా గురువుగారు నీడలాగా ఉండి ఆయన శక్తితో, అనుగ్రహంతో నాకు జాబ్ ఇప్పించినారు.




బుర్రిపాలెం. రమాలక్ష్మి.

సాయి శక్తికి సజీవ రూపం... రూపుదాల్చిన సద్గురు తత్త్వం...
సంచరించే దైవత్వం...
సాయి సాంప్రదాయ పరిపూర్ణతకై... మానవాళి మనోద్ధరణకై...
శ్రీ సాయి ప్రసాదించిన మహితవరం...
**శ్రీ సాయి నాథుని శరత్ బాబూజీ**

## బాబా మందిర నిర్మాణంలో - గురూజీ అభయహస్తం

రాబోవు కాలములో జరగబోవు సన్నివేశములను వివిధమైన విధానాలద్వారా! అనుభవాల ద్వారా తెలియజెప్పగలిగినది ఒక్క సద్గురువుకు మాత్రమే సాధ్యపడుతుంది. కలలోని సంభాషణ కల్లకాదని వాస్తవమని కలలో ఇచ్చిన వాగ్దానమును సైతము నెరవేర్చగలిగేది ఒక్క సద్గురువేనని అనుభవాన్ని గురుకృప ద్వారా పంచుకోబోతున్నందుకు సంతోషముగా ఉంది.

నా పేరు శెట్టిపల్లి వీరాస్వామి. మధ్యప్రదేశ్ లోని పల్సుద్ నా నివాసగ్రామము. మధ్యప్రదేశ్ కు పశ్చిమదిశలో కొండలు, లోయలకు మధ్యభాగంలో విలసిల్లె చిన్న పల్లెటూరు పల్సుద్. బాబా ఆదేశమా? అన్నట్లుగా 1985సం.నుండి మేము ఆ గ్రామాములో నివసిస్తున్నాము. 1988 సం. గురువుగారితో నాకు పరిచయమైన తరువాత నుంచి మా గ్రామానికి రమ్మని కోరేవాడిని. ఎందుకంటె ఈ ప్రాంతీయులకు బాబాను గురించి బొత్తిగా తెలియదు. ఈ ప్రాంతానికి గనుక గురువుగారు వస్తే బాబా గురించి తెలియని వారికి తెలుస్తుందని నా భావన. గురువుగారు అలాగేనని అనేవారు. గురువుగారి ఆశీర్వాదంతో మా ఇంట్లో సత్సంగం ఏర్పాటు చేసికొన్నాము. 10 లేక 15 మందిదాకా వచ్చేవారు. 1999లో మాకాలనీ వాసులందరు కల్సి ఇక్కడ మన మందరం కల్సి బాబా మందిరాన్ని ఏర్పాటు చేసుకుంటె ఎలా వుంటుందని అడిగారు నన్ను. ఈ రోజు పున్నమి పాలు కాచి తాగే కార్యక్రమముందిగదా. రాత్రికి అందరికి ఈ విషయాన్ని చెప్పిచూద్దామన్నాను నేను.



ఇది బాబా సంకల్పమనుకొని ఆనందించాను. వచ్చిన వారందరు బాబా మందిర నిర్మాణానికి ఖాళీ స్థలం చూడటం ఆ గ్రామసర్పంచి గార్కి ఈ విషయాన్ని చెప్పటమ జరిగింది. సర్పంచిగారు వచ్చి ఖాళీ స్థలాన్ని చూచి అక్కడి ప్రజలతో మాట్లాడి వాళ్ళకు ఎలాంటి ఇబ్బంది లేనివిధంగా ఏర్పాటు చేసి మీ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించండని చెప్పారు. కాలనీ వాసులందరు సమావేశమై నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. మందిర నిర్మాణం జరగబోవుటకు ముందుగా గురువుగారిని సంప్రదించి వారి ఆశీర్వాదంతో కార్యక్రమం ప్రారంభిస్తే మన పనులన్నీ వారి అనుగ్రహవిశేషంతో సులభంగా జరుగుతాయని నేను వారితో చెప్పాను. మనమెక్కడైతే మందిరం నిర్మాణం చేయాలనుకొంటామో ఆప్రదేశంలో భజన, సత్సంగం, పారాయణ వంటి కార్యక్రమాలు చేపడితే ఎంతో మంచిదని గురువుగారనేవారని వారికి చెప్పాను. అందుకు అందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. నేను వెంటనే ఈ విషయాన్ని చెప్పాలనే తలంపుతో శిరిడీకి ఫోను చేసాను. భాను మూర్తి గారు ఫోను అందుకొని విషయం తెలుసుకొనిన తరువాత ప్రస్తుతం గురువుగారు ఇక్కడ లేరు. నేను తప్పకుండా ఈసమాచారాన్ని తెలియజేస్తాను. మందిర నిర్మాణ విషయంలో గురువుగారు అనుగ్రహం ఎప్పుడు ఉంటుంది. మీరు మీ ప్రయత్నాలు చేసుకోండని చెప్పిన తరువాత, ఒక గురువారం రోజున మేమంతా కలసి బాబా, గురువుగారి ఫోటోలను పెట్టుకొని పూజచేసి పని ప్రారంభించాము.


మా కాలనీలో ఉండే యువకుడొకడు వచ్చి ప్లింత్ ఏరియా మొత్తం వరకు నేను కట్టిస్తానని చెప్పాడు. అతను చెప్పినట్లుగానే పని ప్రారంభించి ప్లింత్ ఏరియాను పూర్తిచేసాడు. గ్రామంలో ప్రజలందరికి నమ్మకం కుదిరింది. మేమనుకున్న దానికంటె ప్రజల సహకారం అధికంగా లభించింది. జరగవలసిన నిర్మాణమేదైతే ఉందో అది చకచక సాగిపోతుంది గురువుగారి అనుగ్రహంతో. నేను ప్రతిరోజు గురువుగార్ని, బాబాను ప్రార్థించేవాడిని ఇక్కడి బాబా మందిరం పెద్దదిగాను, అందంగాను రావాలని మందిరము పాలరాతితో నిర్మాణము జరిగింది.

బాబా విగ్రహం గూడా శిరిడీలో మాదిరిగా అందంగా, పెద్దదిగా ఉండాలని ప్రార్థించాము. అలానే పేరు ప్రఖ్యాతిగాంచిన జయపూరు శిల్పి బాబా చూపించినట్లుగా మాకు తటస్థపడ్డాడు. ఆ శిల్పి గూడా మేమూహించిన దానికంటె అందంగా, నవ్వుతున్నట్లుగా బాబా మూర్తిని తయారు చేసి మాకు ఇచ్చాడు.

ఆ విగ్రహాన్ని తీసికొని నేరుగా శిరిడీలోని సాయి యానాకు తీసికొని వెళ్ళాము. మళ్ళీ బాబాను, గురువుగారి చేతుల మీదుగా విగ్రహప్రతిష్ఠ మా ఊళ్ళో జరగాలని ప్రార్థించాము. మధ్య మధ్యలో గురువుగార్ని దర్శించినప్పుడల్లా మందిర నిర్మాణాన్ని గురించి చెప్పేవాడను.

2001 జనవరి 4 తారీకున మా గ్రామం నుండి సుమారు 30 మంది శిరిడీకి బయలుదేరి గురువుగార్ని దర్శించి మీ చేతుల మీదుగా మందిరంలో బాబా ప్రతిష్ట జరగాలని వినయంగాను, ఆర్తిగాను, అందరం కలిసి ఆర్థించాము, ప్రార్థించాము, వారి ఆర్తి, శ్రద్ధ, గమనించిన గురువుగారు ద్రవించి వచ్చేందుకు సుముఖతను ప్రకటించారు.

గురుపూర్ణిమ తరువాత జూలై 8వ తారీఖు విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవానికి నిర్ణయము జరిగింది. మళ్ళీనేను బాబాను, గురువు గారిని ప్రార్థించాము. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలకంటే ఇక్కడ ఈ కార్యక్రమే గొప్పదిగాను, ఆనందదాయకంగాను ఉండాలి, 5,6 వేల మందికి తప్పకుండా అన్నదాన కార్యక్రమం జరగాలి. ఒక గొప్ప మహాత్ముడు ఈ గ్రామానికి రాబోతున్నారని అది మన గ్రామప్రజల అదృష్టమని వారందరితోను అన్నాను. గురువుగారు ఇక్కడకు వచ్చినప్పుడు వారికి ఎలాంటి అసౌకర్యము కలగరాదని, మనగ్రామ గొప్పతనాన్ని కాపాడుకోవాలని వారందరికి చెప్పాను. బాబా, గురువుగారు నా ప్రార్థనను ఆలకించారు. అనుకున్నట్లుగానే ఆనందదాయకంగా ఊహించినదానికంటె ఎక్కువగా జరిగింది. ఎక్కడెక్కడి నుండో తండోపతండాలుగా ప్రజలు ఇక్కడికి వచ్చారు.



మందిర నిర్మాణానికి 5సం. ముందుగానే గురువుగారు ముగ్గురుకి కలలో కన్పించి పల్సుద్ రాబోతున్నట్లుగా సూచించారు. 1994లో మా పెద్దబ్బాయి రమేష్‌కు గురువుగారు పల్సుద్ వీధులలో ఊరేగింపుగా తిరుగుతున్నట్లుగా కలవచ్చింది. ఈ విషయాన్ని అప్పుడే మా అబ్బాయి గురువుగార్కి చెప్పాడు.

1996లో మా కోడలు రేఖకు గురువుగారు మా ఇంటికి వచ్చినట్లుగాను, గురువుగార్ని మెద్దె మీదగల గదిలో రమ్మని చెప్పగా ఇంకా సమయముందిలే అని అన్నారని తనకు వచ్చిన కలని వివరించింది. ఆయన అయిదు సం.రాల క్రితం కలలో ఏ సన్నివేశాన్ని వాళ్ళకు చూపించారో యధాతధంగా దాన్ని 2001సం. లో వాస్తవం చేసారు గురువుగారు.

కలలద్వారా ఓ దివ్యానుభూతిని కల్పించిన గురువుగారు ఇక్కడి గ్రామప్రజలు బాబా మందిర నిర్మాణం చేయాలనే సంకల్పాన్ని వాళ్ళకు కలిగించారు. ఆయన అభయ హస్తమే అదృశ్యంగా మందిర నిర్మాణానికి సహకారమిచ్చింది. ఎప్పటినుండో కలలుకన్న నాకోర్కెను గురువుగారు ఇలాతీర్చారు. గురువుగారి పాదధూళితో పావనమైన మా గ్రామాన్ని చూస్తే నాకెంతో సంతోషంగా ఉంది. ఇప్పుడు బాబా భక్తులు గూడా ఎక్కువైనారు. మందిరంలో జరిగే భజన మొదలగు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఇదంతా గురుకృపేనని అనుభవం.

పల్సుద్ — శెట్టిపల్లి వీరాస్వామి
11-8-2001

## అడక్కుండా ఇచ్చిన వరం

మేము నవీ ముంబాయిలో ఉంటాము. గురుపూర్ణిమ ఉత్సవాలకు 4వ తారీకు రాత్రి షిరిడీ వచ్చాము మమల్ని చూస్తూనే శ్రీ సాయిప్రసాద్ గారు మీ ఇంట్లో సత్సంగము ప్రారంభించండి అన్నారు. మాకు రాగానే ఈ మాట వినగానే చాలా సంతోషము వేసినది. గురుపూర్ణిమ రోజునే బాబా, గురువుగారి ఫోటోలు సత్సంగముకోసం

తీసుకున్నాము. శుక్రవారము 6 వ తారీఖున సాయంత్రము 6.30 గం||లకు మాకు నూతన సత్సంగము ప్రారంభించుటకు గురువుగారి నుండి అనుమతి లభించింది. శనివారము ఉదయం 12.30లకు బాబా ఫోటోని గురువుగారి ఆశీస్సులతో తీసుకున్నాము. గురువుగారి ఫోటోని శ్రీనారాయణరావుగారి చేతుల మీదుగా తీసుకున్నాము. మేము 12వ తేది, గురువారము ఫోటోలతో ముంబాయి చేరుకున్నాము. మేము అక్కడున్న తెలుగు సాయిభక్తులకు, మరాఠి భక్తులకు తెలియజేసి 19 మంగళవారము సాయంత్రము 7.30 గం.లకు నూతన సత్సంగము మా ఇంట్లో ప్రారంభించాము. నేను ఇవి చదవాలని ప్లాను కూడా చేసుకోలేదు.


కాని మంచి ఆర్టికల్స్ "గురువుగారు" నా చేత చదివించారు. నిత్య ప్రార్ధనతో మొదలు పెట్టి, క్రొత్త సాయి సచ్చరిత్రములోని మొదటి అధ్యాయము, ప్రప్రధమ సాయిమందిరము భివ్‌పురి మరియు 1993 విజయదశమి నాటి గురువుగారి సత్సంగము, గురుభక్తి అను చిన్న ఆర్టికల్ చదివాము. తదుపరి భజన, హారతి నైవేద్యముతో ముగిసినది. మొత్తం 25 మంది పాల్గొన్నారు. మరాఠి వారు మిక్కిలి శ్రద్ధతో "గురువుగారి" గురించి అడిగారు. మా ఆనందము మాటలలో చెప్పలేనిది. ఇది మేము ఎన్నడూ ఊహించనిది. మాకు ఇది "గురువుగారు" అడక్కుండా ఇచ్చినటువంటి వరము.

భక్తితో

22-7-2001 ఎమ్. దుర్గారాణి

ముంబాయి ఎమ్. రాజజశేఖరు రెడ్డి.

పరిపూర్ణ దివ్యత్వం ధరించిన మానుషరూపమే -- శ్రీ సాయిబాబా!
అవధులు లేని దైవశక్తి పాంచభౌతిక దేహం యొక్క పరిధులలో
ఎంతవరకు ప్రకటం కాగలదోనన్న దానికి అవధియే -- శ్రీ సాయి మహిమ!
...శ్రీ బాబూజీ



## కోరిక తీరింది

మాకు ఎప్పటినుంచో చిన్న బిల్డింగ్ కట్టుకోవాలని ఉండేది. మా రెండవ కుమారుడు వారేపల్లి వెంకటేశ్వరరావు, శాంతి, గవర్నమెంటువారు ఇచ్చేలోను సాంక్షన్ అవ్వటములేదు. మా పెద్ద అబ్బాయి వారేపల్లి సాయిదుర్గారావు, సాయిలీల, తెనాలిలో ఉంటున్నారు. నాన్న మనము ఇంటి దగ్గర సత్సంగము పెట్టిద్దాము బాబా దయ, గురువుగారి దయవల్ల కోరిక నెరవేరుతుంది అని చెప్పి, ది: 19.3.2000 ఆదివారము రోజున మా యింటి దగ్గర సత్సంగమును తెనాలి చుట్టుప్రక్కల గ్రామ, గురు బంధువులు వంద మంది వచ్చి సత్సంగము ఏర్పాటు చేసుకొని సత్సంగము పెట్టినారు. ఫాల్గుణ పౌర్ణమి రోజున బాబా దయ వలన, గురుదేవులు శరద్బాబూజీ గారి దయ వలన బిల్డింగ్ కట్టుకున్నాము. తేది 15.4.2001 ఆదివారము గృహ ప్రవేశమునకు పెద్దలు ముహూర్తము పెట్టినారు. కాని 12,13, తారీఖులు రెండు రోజులు కూడా విపరీతమైన వర్షము వచ్చినది. అప్పుడు బాబా సాయి, గురుదేవా శరత్ బాబూజీ గృహ ప్రవేశమునకు ముహూర్తము పెట్టుకున్నాము. బంధువులందరికి శుభలేఖలు వెళ్ళినవి. ఇట్లా వాన వస్తే మేము ఏమి చేయాలి అని మేమందరము వేడుకున్నాము. 14.4.2001 శనివారం ఉదయం నుంచి వానపోయి మామూలు వాతావరణము ఏర్పడినది. అందుకు మేము అందరము సంతోషించి బాబాని స్మరించుకొనుచున్నాము. గురుదేవులను కూడా స్మరించు కొనుచున్నాము. బిల్డింగ్‌కి కొంత అప్పుచేసినాము. అది కూడా తీర్చే దారి చూపమని బాబాని గురువుగార్ని వేడుకొనుచున్నాము.

ఈ అనుభవమును గురుకృపద్వారా గురుబంధువులందరకు తెలుపుకొంటూ గురువుగార్కి, బాబాకు మా హృదయ పూర్వక నమస్కారములు.

ఇట్లు

పులిగడ్డ — పారేపల్లి సూర్యనారాయణ

> బాబా కృపాదృష్టి ఎప్పుడూ మన మీద వున్నదన్న గురుతే, ఆ ఎఱుకే మనకు గురువై మనల్ని రక్షించి తరింపజేస్తుంది. ఆ గురుతును, ఆ ఎరుకను నిరంతరం నిలుపుకోవడమే సాధన.
>
> ...శ్రీ బాబూజీ
>
> జుట్టు నీకేమి అపకారం చేసిందని దాన్ని మాటి మాటికి ఖండించివేస్తావు.
> కామ క్రోధాదులతో నిండిన మనస్సును పునీతం చేసుకోవేం.
> ఖండించవలసింది తల మీద వెంట్రుకలను కాదు. తలలోపలి చెడు తలపులను ఖండించు.
>
> ...కబీరు

## ఆ చేయి ఎంత వేయి.... భాగము-14

***మట్టి కుండలను పయోగించె బాబా ... మట్టి మనుషులకు మెరుగులిచ్చె గురూజీ .....***



సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రంను 1992 సం|| జనవరి 12వ తారీకున తెనాలిలో రామలింగేశ్వర పేటలో "బాబా" మందిరంలో స్థాపించారు. 7 సంవత్సరాల కాలం అక్కడే ప్రతి ఆదివారం రసవత్తరమైన సత్సంగాలు జరిగేవి. కొన్ని కారణాల వలన సత్సంగం అక్కడనుండి మార్చబడింది. 29-7-2001నాటికి "500 వారాలు 500 సత్సంగాలు" అనే నినాదంలో ఉత్సాహభరితులైన గురుబంధువులందరూ కలిసి "ఆదరణ" ఊరేగింపు, సత్సంగం వంటి కార్యక్రమాలను చేపట్టారు. "ఆదరణ" క్రింద స్థానిక ప్రభుత్వవైద్యశాలలో 120 మంది రోగులకు స్వస్థత చేకూరాలని ప్రార్థన జరిపి సత్సంగం క్రింద వారికి ఉచితంగా పండ్లను పంచి, బాబా ఫోటోలనిచ్చినారు. ఎప్పటి మాదిరిగానే సత్సంగం ఆరంభమైంది. అందులో "రుక్మిణి" అను సత్సంగకురాలు ఇలా ప్రశ్న వేసింది.

రుక్మిణి: "సాయిగారు" మీరు బాబా లీలలను వివరించుతా మధ్యమధ్యలో బాబా లీలలకు సరిజోడు వంటి గురువుగారి లీలలను వివరిస్తారు. బాబాకు గురువుగారికి ఏ మాత్రము తేడా లేదనే భావనే మీ సత్సంగంలో తేటతెల్లమౌతుంది. ప్రతి పర్యాయం ఒక బాబా లీల, దానికి సరిసమానంగా గురువుగారి లీల వెంట వెంటనే చెప్తుంటారు. బాబా చేసిన లీలలన్నీ గురువుగారు చేసారా? ఇలాంటి సందేహం నాకు ఎంతో కాలం నుండి వుంది. ఏ ఏ విషయాల్లో బాబా - గురువుగారు ఒక్కటే, అన్న విషయాన్ని ఈ రోజు 500 వారాలు -- 500 సత్సంగాలు కార్యక్రమంలో వివరించగలరని కోరుచున్నాను.

సాయి: రుక్మిణి! నీ దృష్టిలో బాబా చేసిన లీల ఏమిటో ఆ లీలలను గురించి ఏమనుకుంటున్నావో చెప్పు.

రుక్మిణి: బాబా పచ్చి కుండలతో ప్రతి రోజు నీరు తెచ్చిమొక్కలకు పోసేవారని చదివాం. ఆ లీలలను అందులోని అంతరార్థము మీరు సత్సంగములో విశదంగా చెప్పగా మేమంతా విన్నాము. అలాగే గురువుగారు కూడా పచ్చికుండలతో నీరు తెచ్చి మొక్కలకు ఎప్పుడైనా ! పోసారా!


జవాబు : పచ్చికుండలను గురువుగారు ఉపయోగించారు, ఉపయోగిస్తున్నారు. వారి దగ్గరకు ప్రారంభంలో వచ్చినవన్నీ పచ్చికుండలేనమ్మా! ఇక్కడి పచ్చి కుండలను గురువుగారు "బాబా సన్నిధికి" సమర్పించారు. ఆ పచ్చి కుండలు ఈ రోజున బాబా సేవకు ఉపయోగపడుతున్నవి.

రుక్మిణి: మీరు సూక్ష్మంగా చెబితే మాకెలా అర్ధమౌతుంది? వివరంగా, ఉదాహరణ, ఉపమానయుక్తంగా మా అందరికి అర్ధమయ్యేలా చెప్పండి.

జవాబు: ఈ ప్రశ్నకు భారం వహించేది గురువుగారేనమ్మా! "బాబా" తన లీలలను ముద్దుల కుమారుడైన మన గురువుగారి ద్వారా ఎలా చేయించారో గమనిద్దాం! సమాధానమేమిచ్చినా! అదంతా ఆయనదే.

"బాబా" ప్రతి రోజు నియమాను సారంగా పచ్చికుండలతో నీరు తెచ్చి వృక్షసించనం చేసే వారని చరిత్ర వ్రాసింది. వామన్‌తాత్యా పచ్చికుండలను ఇచ్చే వారని బాబా ఉపయోగించిన తరువాత వాటంతటవి విచ్చుకొనేవని భక్తులు తమ తమ అనుభవాలలో చెప్పారు. ఈ మాటలు ఊహా జనితములు కావు, వినేందుకు ఆశ్చర్యం కల్గిస్తాయి. నిజ జీవితంలో మంత్ర తంత్రాలు అధీనమందుంచుకొనిన మహా వేత్తలు, క్షుద్రోపాసకులు చేసినట్లుగా సినిమాలలోను, టి.వీ.లలోను చూడగల్గుతాము. అదంతా ఫోటో గ్రాఫిక్ ట్రిక్స్ మాత్రమే. కాని బాబా విషయంలో అలా కాదు.

పచ్చికుండలను తయారు చేసిన తరువాత కులాలచక్రం నుండి ఎంతో జాగ్రత్తగా వేరు చేస్తారు. కాలని ఆ పచ్చికుండలో నీరు నింపేదెలా? నింపిన పచ్చికుండను పట్టుకునెదెలా? మొక్కలకు నీరు పోసెదెలా? వాటమెలా బాబాకు కుదిరిందో అర్ధం కాకున్నది. పై పెచ్చు నీటి చెమ్మ తగిలిన మరుక్షణమే అది విచ్చిపోతుంది? ఈ లీలలను అర్ధం చేసుకోవటానికి నాకు అర్హత చాలదు. ఆంతర్యం అవగాహనకాక కొన్ని సంవత్సరాలు కొట్టుకు మిట్టులాడాను. బాబా సన్నిధిలో లీలకు ఎంతో అర్ధముంటుందే! అది నాకు భోదపడేదెలా? దానిని నాకు విశదీకరించువారెవరని వాపోయిన సందర్భములున్నవి. అప్పటి ఆ లీలను చూసే భాగ్యం బాబా నాకప్పుడు కలిగించారో లేదో తెలియదుగాని దాని యొక్క భావ సామ్యాన్ని అనుభవవమయ్యేలా, అంతటి లీలను మరల చేయగలిగిన సద్గురువును బాబా నాకు చూపించారు. వారి చరణ సన్నిధిలోనే, వారి సన్నిహిత సహచర్యంలోనే నాతోపాటు, మరెందరికో అర్ధమయ్యేలా! బాబా నాలాంటి వారి కోసంగా గురువుగార్ని పంపారు.



పచ్చికుండ ఉపయోగించుటకు పనికిరానిది. బాబా హస్త స్పర్శతో అది ఉపయోగార్హత పొందింది. దాని పుట్టుకకొక సార్ధక్యము ఏర్పడింది. మొత్తము మీద నిరుపయోగముగా ముగియవలసిన వస్తువుగాని, జీవిగాని, ఉపయోగపడే విధముగా మారుట, జీవితానికి పరిపూర్ణత్వము కలిగించుట అనే భావంలో బాబా లీలలను అన్వయించుకోగలిగితే అందులోని భావసౌందర్యము అర్ధవంతము కాగలదు.

జీవి విషయంలోను, జీవిత విషయంలోను గురువుగారు ఏ విధంగా పచ్చికుండలకు విలువలను పెంచారో, "పచ్చికుండలు కావవి" పరమ పావనుని పాదములంటే కుండలని గురువుగారు మార్చి చూపినారు. ఈ పచ్చికుండలను గూడా వారు నింపారు. గురువుగారు పచ్చికుండల్లో నింపింది నీరు కాదను విషయం పోనుపోను మీకే అర్ధమవుతుంది.పచ్చికుండలవంటి వ్యక్తులకు గురువుగారు ఎంతటి మెరుగులను దిద్దారో తెలుసుకుందాం. అక్కడ బాబా పచ్చికుండను ఉపయోగించగా ఇక్కడ గురువుగారు పచ్చికుండలవంటి వ్యక్తులను దరికి తీసికొనినారు.

ఈనాడెందరో గురుదేవుల అనుగ్రహానికి పాత్రులైనవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. గురుదేవులకు అతిసన్నిహితంగా సంచరించే నలుగురిజీవితాలను స్థాలీపులాకన్యాయంగా వారి పూర్వజీవితము, గురుదేవుల వద్దకు వచ్చిన తరువాత మారిన జీవితమును తులనాత్మకపు ధోరణిలో తెలుసుకోవాలి.

*ఆ వివరాలను తెలుసుకోవాలంటే తప్పదిక - వేచి ఉండక.*

సమర్పణ -- డా. జి. సాయివర ప్రసాదరావు, రీడరు, రేపల్లె

> గురుకృప, మహిమ అనంతం. నాకు ఆయన చేసిన మహోపకారం అపారం.
> అనంతుని (గురుదేవుని) దర్శించగల అనంత వీక్షణాన్ని అనుగ్రహించారు.
> ... కబీరు

## "మహనీయుల - మహితోక్తులు...."

భజన - నామ జపం - పారాయణ - సద్గురుని చరణ సన్నిధికి చేర్చు సులభమైన మార్గమని "మహనీయుల మహితోక్తి". తుకారాం, కబీరు, భజనకు మంచి నిర్వచనమిచ్చినారు. "బాబా" భజన చేసినట్లు తెలియుచున్నది. భజనెంతటి స్ఫూర్తినిస్తుందో, ఎంతటి మానసోల్లాసమును కల్గిస్తుందో "తుకారాం" వివరించారు. భజనంటే ఏమిటి అన్న విషయం మీద మన గురువుగారి అభిప్రాయం, అద్భుతమైంది, అనంతమైంది, రసదాయకమైంది. వారి మాటల్లో భజనకు నిర్వచన మిలా చెప్పారు.



"భజనకు భావమే ప్రాణం. భజనంటె బృంద గానం కాదు. మన ఇష్టదైవం పట్ల మనకున్న ప్రేమ ఇంకా అనంతంగా, అనన్యంగా పెరగాలన్న ఆర్తికి; ఆ ఆర్తి మన హృదాలలో నిగిడిస్తున్న రస స్పందనకు వ్యక్త రూపమే భజన...(సాయిపథం మార్చి 2001 సంచిక నుండి గ్రహించబడినది).

పైన గురువుగారు వివరించిన భావాన్ని మనోగతం కానీయకుండా, అర్థం కాకుండా భజన సాగించితే అదికేవలం వినోదదాయకం, చిన్నపాటి కచ్చేరి, కాలక్షేపం మాత్రమే. (గుళ్ళో పురాణ కాలక్షేపముంది వెళ్ళొస్తా అనే మాట మనకు వర్తిస్తుంది) ఆర్తి అనే పేరున, ముసుగు మాటున అవసరమనే అక్షరాలు స్పష్టంగా కన్పిస్తాయి. మహనీయుల కాలంలోను రకరకాలైన భజనలు సాగించిన ముసుగు భక్తులున్నట్లున్నారు. ఒకానొక సందర్భములో

"జన బలానికి - ధన బలానికి
మురిసి పోదువని - నేననుకోను
అలంకరణకు - ఆకర్షణకు
లోబడవని - నాకు తెలుసు
"కబీరనుచున్నాడు" "ప్రభూ"
భజనకు వేల వేల ఖర్చా
ఇదెక్కడి లెక్కయ్యా!

ఎంత అధికంగా భజనకు ఖర్చు పెడితె అంతగా తమ తమ అవసరాలు తీరిపోతవనో; తమ పాపాల చిట్టాలు చింపివేయబడతాయనో, తమ భక్తి ప్రపత్తులు బహిర్గతమవుతాయనో నా(నే)టి సమాజం భావించింది కాబోలు. మరో మాట కూడా అన్నారు.

"వ్యాపారులందరు - దరిచేరినారు
భజనలు సాగించుచున్నారు
ధనమును ఖర్చు చేయుచున్నారు
"కబీరను చున్నాడు" "ప్రభూ"

***ఇంత పెట్టుబడికి ఎంత లాభమో!***

భజనంటె లాభసాటి వ్యాపారం కాదు. కాంట్రాక్టు పద్ధతులపై నడిపేది కాదు. పిత్తనం దానమిస్తే చెట్టంత ధనం ఇచ్చె పిధానం కాదు. అవసారల కోసం ఆర్తినటించరాదు. గురువుగారి మాట హృదయ పీణను మీటుతున్నంతవరకు అటువంటి వ్యాపారసరళమైన "భజన" నవ్వునిస్తుంది.

అనువాదం-పివరణ

...గురుచరణ దాసుడు.



a a a a a a a a